
శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

## పోలింగ్ విధులను బాధ్యతతో నిర్వర్తించాలి

**జిల్లా ఎన్నికల అధికారి శశాంక, జనరల్ అబ్జర్వర్ ఇరా సింఘాల్**

మహబూబాబాద్, నవంబర్ 21: పోలింగ్ విధులను ఎన్నికల నిబంధనల ప్రకారం బాధ్యతతో, పూర్తి అవగాహనతో నిర్వర్తించాలని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక, జనరల్ అబ్జర్వర్ ఇరా సింఘాల్ అధికారులకు సూచించారు. మంగళవారం ఎన్నికల విధుల్లో పాల్గొనే వారికి ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను వారు పరిశీలించారు. డోర్నకల్ నియోజకవర్గానికి సంబంధించి మరిపెడలోని మోడల్ జూనియర్ కాలేజీని, మహబూబాబాద్‌కు సంబంధించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఎన్నికల శిక్షణ తరగతుల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్థం కాని వారు మాస్టర్ ట్రైనర్స్‌ను అడిగి తెలుసుకోవాలని, పోలింగ్ అధికారులకు సరఫరా చేసే సామగ్రిని సరిచూసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయలేని 80 ఏళ్ల వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టిందన్నారు. గతంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల పత్రాల్లో 20 శాతం మాత్రమే లెక్కించేందుకు తీసుకున్నారని, ఈ సారి 100 శాతం పోస్టల్ బ్యాలెట్ల ఓట్లను లెక్కించాలన్నారు. అర్థం కాకుంటే అడిగి తెలుసుకోవాలని, పొరపాట్లు మాత్రం చేయవద్దన్నారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు నర్సింహారావు, అలివేలు, సీపీవో సుబ్బారావు, డీఈవో రామారావు, ఉన్నికల శిక్షణ నోడల్ అధికారి సూర్యనారాయణ, సహాయ ఎన్నికల రిటర్నింగ్, సెక్టోరియల్, ప్రొసైడింగ్, సహాయ ప్రొసైడింగ్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల హితం కోసమే చండీహోమం

**బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్**


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్, చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్, నవంబర్ 21 : ప్రజల హితం కోసమే చండీహోమం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకర్‌నాయక్- సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో అర్చకుడు సుమన్‌శర్మ చండీ హోమం తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో తులతూగాలని హోమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్తె, కుమారుడు తేజస్విని, సూర్యచంద్ర, పట్టణ యూత్ అధ్యక్షుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రఘు, భూక్యా సునీత పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ సార్‌కు కృతజ్ఞతలు



డోర్నకల్, నవంబర్ 21: మరిపెడ ప్రజా ఆశీర్వాద సభలో డోర్నకల్‌కు వంద పడకల దవాఖాన ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడం హర్షణీయం. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వ దవాఖానలో రోగులకు సకల సౌకర్యాలను కల్పిస్తున్నది. పట్టణ, గ్రామీణ ప్రజలకు వంద పడకల దవాఖాన ఎంతో గా నో ఉపయోగకరం. సీఎం కేసీఆర్ సార్‌కు కృతజ్ఞతలు.

-తేజావత్ భిక్షం, బొడ్రాయి తండా

# ఢిల్లీ పార్టీలకు ఓటేస్తే వందేళ్లు వెనక్కి వెళ్తాం

- గిరిజనేతరులకు సైతం పోడు పట్టాలు
- ప్రచార సభలో మంత్రి సత్యవతి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్


మాట్లాడుతున్న మంత్రి సత్యవతి

గూడూరు, నవంబర్ 21 : ఢిల్లీ గులాంలకు ఓటేస్తే అభివృద్ధి వందేళ్లు వెనక్కి వెళ్తుందని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని గూడూరు, చిర్రకుంటతండా, రాములుతండా, పడమటితండా, పొనుగోడు, అయోధ్యపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రచార సభల్లో వారు మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలకు ఢిల్లీలో బాస్‌లు ఉంటారని, బీఆర్ఎస్‌కు మాత్రం గల్లీలోనే ఉండే బాస్‌లన్నారు. వారికి వారి అధిష్టానం చెబితేనే పనులవుతాయని, బీఆర్ఎస్‌కు ప్రజలు చెబితేనే పనులు అవుతాయన్నారు. ప్రజల అవసరాలను, అభివృద్ధి, సంక్షేమాలను బీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తించి పనులు చేసిందన్నారు. పక్క రాష్ట్రంలో కరెంట్, పింఛన్లు సరిగా ఇవ్వని కాంగ్రెస్ ఈ రాష్ట్రంలో ఎలా ఇస్తుందో ప్రజలు ఆలోచన చేయాలన్నారు. మన రాష్ట్రంలో అమలవుతున్న రైతుబంధు, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు, 24 గంటల విద్యుత్ లాంటి అనేక పథకాలు ఇతర రాష్ట్రాల్లో ఎందుకు ఇతర పార్టీలు అమలు చేయడం లేదని విమర్శించారు. జాతీయ పార్టీలకు అన్ని రాష్ట్రాల్లో ఒకే విధానం ఉండాలన్నారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధానం ఉంటే అవి కేవలం ఓట్లు కోసం చేసే రాజకీయాలేనని ప్రజలు గమనించాలన్నారు. గత ప్రభుత్వం హయాంలో స్టాటర్లను, మోటర్లను నెత్తిన పెట్టుకుని రిపేర్లకోసం మనం తిరగలేదా? గతంలో ఇంటింటికీ శుద్ధ జలాలు సమృద్ధిగా ఏ ప్రభుత్వమైనా ఇచ్చిందా? అని ప్రశ్నించారు. గూడూరులో వేల ఎకరాలకు పోడు పట్టాలిచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొత్త గ్రామపంచాయతీలు ఏర్పడి, తండాలు, గూడాలు కూడా గ్రామ పంచాయతీలుగా మారి అభివృద్ధికి నోచుకున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారెంటీల పథకాలు తమ ప్రభుత్వం 60 గ్యారెంటీలు మ్యానిఫెస్టోలో పెట్టకుండానే నెరవేర్చిందన్నారు. నేడు మండలంలో పాకాల వాగు 5 చెక్‌డ్యాంలతో నిరంతరం నీటితో అలరారుతున్నదన్నారు. మండలాన్ని విద్య, వైద్యంలోనే కాకుండా అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. మూడు గంటల కరెంట్ నాయకులను నమ్మకండని అన్నారు. 46 ఏండ్లు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే ఏం చేసిందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బిందు, జడ్పీటీసీ గుగులోత్ సుచిత్ర, బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు నూకల నరేశ్ రెడ్డి, బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఖాసీం, వైస్ ఎంపీపీ వీరన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి, ముక్కా లక్ష్మణ్‌రావు, బోడ కిషన్, సంపత్‌రావు, నూకల సురేందర్, కే వేణుమాధవ్‌రెడ్డి, వెంకన్న, కఠార్‌సింగ్, రాధిక, కే రవి, సమ్మక్క, నర్సింహ, దోమ సారయ్య, హరీశ్, సురేశ్, శివ, బోడ ఎల్లయ్య, నవీన్, ప్రవీన్, అశోక్, కుమార్, యాదగిరి పాల్గొన్నారు.


హాజరైన ప్రజలు

## 25న గూడూరుకు మంత్రి హరీశ్ రావు రాక

**హెలిప్యాడ్ ల్యాండింగ్ స్థలాన్ని పరిశీలించిన మంత్రి సత్యవతి**

గూడూరు, నవంబర్21: ఈ నెల 25న శనివారం ఆర్థిక, వైద్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు గూడూరుకు ఎన్నికల ప్రచారం కోసం వస్తున్నారని మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. మండలం కేంద్రంలోని అరవింద విద్యాలయంలో వద్ద ఉన్న ఖాళీ స్థలంలో హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేసేందుకు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ గెలుపుకోసం ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు 25న మండల కేంద్రానికి హెలీక్యాప్టర్ ద్వారా వస్తారని, అక్కడి నుంచి ఆదర్శ పాఠశాల పక్కన ఉన్న మైదానంలో నిర్వహించే సభలో పాల్గొంటారని పూర్తి వివరాలు వెల్లడిస్తామని మంత్రి తెలిపారు. ఆయన వెంట జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు నూకల నరేశ్ రెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు కాసీం ఉన్నారు.

## సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం

మరిపెడ, నవంబర్ 21: బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ మరిపెడ ఆశీర్వాద సభకు రాగా, రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోత్ కవిత, డోర్నకల్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ హెలిప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛం అందజేసి, ఘనత స్వాగతం పలికారు. హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నూకల నరేశ్ రెడ్డి, రామసహాయం రంగారెడ్డి తదితరులు ఉన్నారు.

## ఎన్నికలను జయప్రదం చేయడమే లక్ష్యం

**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ**

సుబేదారి, నవంబర్ 21 : ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎన్నికలను సజావుగా నిర్వహించడమే లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ అన్నారు. ఎన్నికల్లో భాగంగా వచ్చిన కేంద్ర పారామిలటరీ బలగాలతో ఆయన మంగళవారం పోలీస్ కమిషనరేట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ ప్రజల జీవన విధానం, భౌగోళిక స్థితిగతులను వారికి వివరించారు. పారా మిలటరీ బృందాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. త్వరలో మరిన్ని కేంద్ర బలగాలు రానున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎన్నికల పరిశీలకుడు సుజిత్‌కుమార్, సరిహద్దు భద్రతా విభాగం కమాండెంట్ ముఖేశ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీలు జితేందర్‌రెడ్డి, రమేశ్‌కుమార్, అర్మ్‌డ్ రిజర్వ్ ఏసీపీ నాగయ్య, కమ్యూనికేషన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ పాల్గొన్నారు.


**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా మహబూబాబాద్ జిల్లా, మహబూబాబాద్ మండలం, మహబూబాబాద్ గ్రామ కాపురస్తులగు శ్రీ/శ్రీమతి బయ్య సరస్వతి, భర్త: సూరి, నివాసం: గ్రామము: మహబూబాబాద్, మండలం మహబూబాబాద్, జిల్లా: మహబూబాబాద్ వీరు శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ మహబూబాబాద్ బ్రాంచీ వారిని ఋణ సదుపాయం పొందుటకు హామీగా ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని తమ రిజిష్టర్ గిఫ్ట్ దస్తావేజు నెం. 14020/2023, తేది: 10-11-2023, మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ వారి సమక్షములో రిజిష్టర్ కాబడిన దాని ద్వారా సంక్రమించిన ఆస్తిని హామీగా ప్రతిపాదించగా సదరు శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ వారు తమ సమ్మతిని తెలిపియున్నారు. సదరు షెడ్యూల్ ఆస్తి విషయమై గాని సదరు ఋణ సదుపాయ విషయమైగాని ఎవరికేని ఎలాంటి అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన (7) దినములలో తగు ఆధారములతో ఈ దిగువ తెలిపిన అడ్రస్ యందు సంప్రదించగలరు. లేని యెడల ఎలాంటి అభ్యంతరములు లేవని తలచి సదరు ఋణ సదుపాయ విషయమై పై కంపెనీ వారు తదుపరి చర్యలు గైకొందురు. గడువు తర్వాత వచ్చిన అభ్యంతరములు పరిగణలోకి తీసుకోబడవు.

షెడ్యూలు ఆస్థి: మహబూబాబాద్ జిల్లా, మహబూబాబాద్ మండలం, మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి నెం. 2-5-44, M.Tiles కప్పుగల గృహ విస్తీర్ణం: 97.64 చ.గ.లు సమము 81.63 చ.మీ.లు గల దానికి హద్దులు: తూర్పు: మున్సిపాలిటీ రోడ్డు మరియు బయ్య సరస్వతి గారి గృహము, పడమర: సలీం గారి గృహము, ఉత్తరం: మడత వెంకటమ్మ మరియు బయ్య సరస్వతి గారల గృహము, దక్షిణం: బయ్య సరస్వతి గారి గృహము.

తేది: 21-11-2023,

ఇట్లు: **బి. ఆనంద్ కుమార్,** అడ్వకేట్,
మహబూబాబాద్, 506 101, Cell: 9440241819.

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా మహబూబాబాద్ జిల్లా, మహబూబాబాద్ మండలం, మహబూబాబాద్ గ్రామ కాపురస్తులగు శ్రీ/శ్రీమతి పోతుగంటి సుశీల, భర్త: పెంటయ్య, నివాసం: గ్రామము: మహబూబాబాద్, మండలం మహబూబాబాద్, జిల్లా: మహబూబాబాద్ వీరు శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ మహబూబాబాద్ బ్రాంచీ వారిని ఋణ సదుపాయం పొందుటకు హామీగా ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని తమ రిజిష్టర్ విక్రయ దస్తావేజు నెం. 9925/2023, తేది: 03-08-2023, మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ వారి సమక్షములో రిజిష్టర్ కాబడిన దాని ద్వారా సంక్రమించిన ఆస్తిని హామీగా ప్రతిపాదించగా సదరు శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ వారు తమ సమ్మతిని తెలిపియున్నారు. సదరు షెడ్యూల్ ఆస్తి విషయమై గాని సదరు ఋణ సదుపాయ విషయమైగాని ఎవరికేని ఎలాంటి అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన (7) దినములలో తగు ఆధారములతో ఈ దిగువ తెలిపిన అడ్రస్ యందు సంప్రదించగలరు. లేని యెడల ఎలాంటి అభ్యంతరములు లేవని తలచి సదరు ఋణ సదుపాయ విషయమై పై కంపెనీ వారు తదుపరి చర్యలు గైకొందురు. గడువు తర్వాత వచ్చిన అభ్యంతరములు పరిగణలోకి తీసుకోబడవు.

షెడ్యూలు ఆస్థి: మహబూబాబాద్ జిల్లా, మహబూబాబాద్ మండలం, మహబూబాబాద్ పురపాలక సంఘ పరిధిలోని మున్సిపల్ డోర్ నెం. 6-1-108/76/82 (Part-2), A.C.C. షీట్ పై కప్పు గల గృహంతో సహా విస్తీర్ణం: 206.20 చ.గ.లు సమము 172.40 చ.మీ.లు గల దానికి హద్దులు: తూర్పు: పోతుగంటి రవీందర్ గారి స్థలం, పడమర: గుండ్ల మల్లయ్య గారి ప్లాట్, ఉత్తరం: ప్రపోజుడు రోడ్డు, దక్షిణం: పోతుగంటి రవీందర్ గారి గృహము.

తేది: 15-11-2023,

ఇట్లు: **బి. ఆనంద్ కుమార్,** అడ్వకేట్,
మహబూబాబాద్, 506 101, Cell: 9440241819.

**అనాథ పిల్లలకు ఉచిత వసతి**

**అనాథ పిల్లలను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ ఆర్ఫనేజ్ హోమ్‌లో చేర్పించాలని హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్: డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్: పెద్ది వెంకటనారాయణ గౌడ్, ట్రెజరర్: బొమ్మినేని పాపి రెడ్డి కోరారు. అనాథ పిల్లలను అక్కున చేర్చుకొని చదువు మరియు వసతి సౌకర్యము ఉచితముగా కల్పించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆర్ఫనేజ్ హోమ్ నిర్వహణకు హనుమకొండలోని రాంనగర్‌లో అధునాతనమైన భవనాన్ని అద్దెకు తీసుకున్నట్లు చెప్పారు. ఆర్ఫనేజ్ హోమ్ నిర్వహణకు శ్రీ. శ్రీ. భోగవల్లి రాజేశ్వర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. అనాథ పిల్లల పాలనా, పోషణ చేపట్టేందుకు హనుమకొండ రెడ్ క్రాస్ సంస్థపై నమ్మకంతో మేనేజింగ్ ట్రస్టీ : రిటైర్డ్ ఐపిఎస్ అధికారి : పాపారావు నిర్వహణ బాధ్యతలను అప్పగించినట్లు వివరించారు. ఈ ఆర్ఫనేజ్ హోమ్ లో మొదటగా తల్లి, తండ్రి ఇద్దరు లేని పిల్లలకు ప్రాధాన్యత కల్పించనున్నట్లు, పిల్లలు లభించని పక్షంలో తల్లి లేదా తండ్రిగాని లేని నిరుపేద పిల్లలకు అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. 6 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల లోపు గల అనాథ పిల్లలకు 30 మందికి ఉచితముగా చదువు మరియు వసతి సౌకర్యము కల్పించనున్నట్లు తెలిపారు. ఆర్ఫనేజ్ హోమ్ నిర్వహణ విజయవంతమైతే హనుమకొండ సమీపంలోని అమ్మవారిపేటలో గల ట్రస్ట్‌కు సంబంధించిన సుమారు అర ఎకరం భూమిని విరాళంగా ఇవ్వడానికి మేనేజింగ్ ట్రస్ట్ : పాపారావు అంగీకారం తెలిపినట్లు పాలకవర్గం పేర్కొన్నారు.**

**INDIAN RED CROSS SOCIETY**
**# 2-7-941, Opp: Collectorate, Subedari, Hanumakonda.**
**Cell : 9154466212**